సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం । 13 । జూలై । 2023



సమస్యలు పరిష్కరించండి

సిరిసిల్లఅర్బన్: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాజన్నసిరిసిల్ల ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతిపత్రం అందజేశారు.



టెక్స్‌టైల్ పార్కు సందర్శన

తంగళ్లపల్లి(సిరిసిల్ల): సారంపల్లి–బద్దెనపల్లి టెక్స్‌టైల్ పార్కును బుధవారం నిజామాబాద్ జిల్లా ఐటీఐ గర్ల్స్ కాలేజీ విద్యార్థినులు ఐటీఓటీ, సీఐటీఎస్ శిక్షణలో భాగంగా సందర్శించారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
26.0/20.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

న్యూస్‌రీల్

అదనపు టీఎంసీ పనులు అడ్డగింత



పనులు అడ్డుకున్న రైతులు

ఇల్లంతకుంట(మానకొండూర్): సగం భూమికే పరిహారం ఇచ్చారని.. మిగతా భూమికి ఇవ్వాలని కోరుతూ రైతులు బుధవారం అదనపు టీఎంసీ పనులను అడ్డుకున్నారు. మండలంలోని ఓబులాపూర్‌కు చెందిన మెడకొక్కుల ఎల్లయ్యకు చెందిన 67 గుంటల వ్యవసాయ భూమి అదనపు టీఎంసీ కాల్వలో పోయింది. మూడేళ్ల క్రితం 37 గుంటలకు మాత్రమే పరిహారం చెల్లించి, మిగతా 30 గుంటలకు రాలేదు. మూడేళ్లుగా రెవెన్యూ, నీటిపారుదలశాఖ అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ బాధిత రైతు మెడకొక్కుల ఎల్లయ్య, గ్రామస్తులతో కలిసి కాల్వ నిర్మాణ పనులు అడ్డుకున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు అక్కడికి చేరుకొని.. మల్లయ్య పరిహారం డబ్బులు మరో రైతుకు ఇచ్చామని.. సమస్యను ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రైతు ఎల్లయ్యకు గ్రామస్తులు అండగా నిలిచారు.

పెంచిన వేతనాలు చెల్లించాలి



కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సిరిసిల్లటౌన్: పెంచిన వేతనాలు చెల్లించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ నెలల తరబడిగా పెండింగ్‌లో ఉంటున్న బిల్లులు చెల్లించాలని కోరారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కోడిగుడ్లు, గ్యాస్, ఇతర నిత్యావసరాల చార్జీలు పెంచాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వమే నిత్యావసరాల వస్తువులు సరఫరా చేయాలని కోరుతూ కలెక్టర్ ఆఫీసులో వినతిపత్రం అందించారు. నాయకులు ఎగమంటి ఎల్లారెడ్డి, కోడం రమణ, గొట్టె బాలమణి, గురజాల శ్రీధర్, మోర అజయ్ పాల్గొన్నారు.

'మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావాలి'



వేములవాడకు చేరుకున్న పాదయాత్ర

వేములవాడ: మహారాష్ట్రలో బీఆర్‌ఎస్ సర్కార్ రావాలంటూ మహారాష్ట్రకు చెందిన బాబారావుమాస్కే– శోభామాస్కేలు చేపట్టిన పాదయాత్ర బుధవారం వేములవాడకు చేరుకుంది. వీరికి ఎమ్మెల్యే రమేశ్‌బాబు స్వాగతం పలికారు. తెలంగాణ తరహాలోని మహారాష్ట్ర అభివృద్ధి చేసేందుకు కేసీఆర్ సీఎం కావాలని కోరారు.

రాజన్నకు నిల్వనాణేలు రూ.41.40 లక్షలు



నాణేలను లెక్కిస్తున్న సేవా ప్రతినిధులు

వేములవాడ: రాజన్న ఆలయంలో నిల్వ ఉన్న నాణేలను బుధవారం ఓపెన్‌స్లాబ్‌లో లెక్కించారు. రూ.41.40 లక్షలు సమకూరినట్లు ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. ఏఈవోలు ప్రతాప నవీన్, బి.శ్రీనివాస్, హరికిషన్, జయకుమారి తదితరులు పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

గురువారం హుండీ లెక్కించనున్నట్లు ఈవో కృష్ణప్రసాద్ తెలిపారు. పేరుకుపోయిన నాణేలను లెక్కించనున్నట్లు చెప్పారు.

జిల్లాలో చిరుజల్లులే..

సిరిసిల్ల: భారీ వర్షసూచనల నేపథ్యంలో జిల్లాలో బుధవారం చిరుజల్లులే కురిశాయి. అత్యధికంగా ఎల్లారెడ్డిపేటలో 15.1 మిల్లీమీటర్లు, అత్యల్పంగా వేములవాడరూరల్‌లో 1.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రుద్రంగిలో 1.7, చందుర్తిలో 6.2, బోయినపల్లిలో 2.8, వేములవాడలో 8.4, సిరిసిల్లలో 8.9, కోనరావుపేటలో 14.3, వీర్నపల్లిలో 13.8, గంభీరావుపేటలో 8.4, ముస్తాబాద్‌లో 5.7, తంగళ్లపల్లిలో 10.3, ఇల్లంతకుంటలో 7.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లాలో 37 శాతం లోటు వర్షం రికార్డు అయింది.

అడ్‌హక్ రసవత్తరం

- రేపు జిల్లా మత్స్యసంఘం ఎన్నికలు
- సర్వసభ్య సమావేశానికి గ్రూపులు
- 'అధికార' పార్టీ జోక్యం
- జిల్లాలో 116 మత్స్య సహకార సంఘాలు
- సంఘాల నేతలతో క్యాంపులు



చేపలు పడుతున్న మత్స్యకారులు(ఫైల్)

సిరిసిల్ల: జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం కొత్తగా ఆవిర్భవిస్తోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కలిసి ఉన్న రాజన్నసిరిసిల్ల జిల్లాను విడదీసి కొత్త జిల్లా యూనిట్‌గా ఈ సంఘాన్ని ఏర్పాటు చేస్తున్నారు. అడ్‌హక్ కమిటీ ఎన్నికకు శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నారు. అడ్‌హక్ కమిటీ ఎన్నికకే గ్రూపు రాజకీయాలు మొదలయ్యాయి. ఇప్పటికే తాము బలపరుస్తున్న అభ్యర్థి గెలుపు కోసం క్యాంపు రాజకీయాలు షురూ చేశారు. కలెక్టరేట్‌లో జరిగే సమావేశంలో చేతులెత్తే విధానంలో అడ్‌హక్ కమిటీ సభ్యులను ఎన్నుకోనున్నారు.

116 సంఘాలు.. 7,562 మంది సభ్యులు

జిల్లాలో 116 మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు ఉండగా.. 7,562 మంది సభ్యులు ఉన్నారు. మరో రెండు మహిళా మత్స్యపారిశ్రామిక సహకార సంఘాలు ఉన్నాయి. ఇందులో 550 మంది మహిళా సభ్యులు ఉన్నారు. జిల్లాలో 362 చెరువులు చేపల పెంపకానికి అనువుగా ఉన్నాయి.

మూడుగా చీలిన గ్రూపులు

రాజన్నసిరిసిల్ల జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం అడ్‌హక్ కమిటీ ఎన్నికలు లాంఛనమే. మరో మూడు నెలల్లో మళ్లీ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరగాల్సి ఉంది. కానీ అధికార పార్టీ నేతల జోక్యంతో జిల్లాలో ఓటుహక్కు గల సహకార సంఘాల ప్రతినిధులు మూడు గ్రూపులుగా చీలినట్లు సమాచారం. ఇందులో ఇల్లంతకుంట మండలం అనంతారం గ్రామానికి చెందిన చొప్పరి రామచంద్రం, వేములవాడ మండలం వట్టెంలకు చెందిన యామ తిరుపతి, ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి చెందిన అన్నవేణి లక్ష్మణ్ వర్గాలుగా చీలినట్లు తెలిసింది. అధికార పార్టీ నేతలు తిరుపతికి మద్దతు తెలుపుతుండగా.. మరికొందరు రామచంద్రంకు, ఇంకొందరు లక్ష్మణ్‌కు అండగా ఉన్నట్లు సమాచారం. వాస్తవానికి అడ్‌హక్ కమిటీ ఎన్నికలు చేతులు ఎత్తే విధానంలో జిల్లా కమిటీ ఏర్పాటుకు ఉపకరిస్తుంది. మరో మూడు నెలల్లో జిల్లా కమిటీ ఎన్నికలు ఉన్నా.. అడ్‌హక్ కమిటీ ఎన్నికల్లోనే మూడు వర్గాలు పోటీ పడడం గమనార్హం.



సిరిసిల్ల మార్కెట్‌లో చేపల అమ్మకం

క్యాంపులు షురూ...

కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి జిల్లా మత్స్యశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమావేశానికి జిల్లాలోని 116 సంఘాల ప్రతినిధులు హాజరుకానున్నారు. జిల్లాలో మూడు గ్రూపులుగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల ప్రతినిధులు విడిపోవడంతో క్యాంపు రాజకీయాలు షురూ అయ్యాయి. ఎవరికి వారు అడ్‌హక్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించేందుకు సభ్యులతో శిబిరాలు నిర్వహిస్తున్నారు. జిల్లా సర్వసభ్య సమావేశం జరిగే రోజున నేరుగా ఆ సమావేశానికి వచ్చేలా ప్రణాళికతో క్యాంపులు నిర్వహించడం చర్చనీయాంశమైంది. కులసంఘాల ప్రతినిధులు, అధికార పార్టీ నేతలు జోక్యంతో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అడ్‌హక్ కమిటీ ఎన్నికలు రసవత్తరంగా మారాయి.

మూడు నెలల్లో మళ్లీ ఎన్నికలు



జిల్లా సర్వసభ్య సమావేశం నిర్వహించి అడ్‌హక్ కమిటీ ఎన్నికలు నిర్వహించడం తప్పనిసరి. ఇందుకోసం సమావేశం ఏర్పాటు చేశాం. మరో మూడు నెలల్లో బ్యాలట్ విధానంలో జిల్లా సంఘానికి ఎన్నికలు జరుగుతాయి. ఆ ఎన్నికలు జరిగే వరకు మాత్రమే ఈ అడ్‌హక్ కమిటీ ఉంటుంది.

– శివప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి

క్రీడాపాఠశాలలో ప్రవేశాలకు ఎంపికలు



సిరిసిల్లఅర్బన్: హకీంపేట, కరీంనగర్, ఆదిలాబాద్‌లోని క్రీడాపాఠశాలల్లో 4, 5వ తరగతుల ప్రవేశాలకు బుధవారం జిల్లాస్థాయి ఎంపిక పోటీలను స్థానిక మినీస్టేడియంలో నిర్వహించారు. డీవైఎస్‌వో అజ్మీరా రాందాస్ క్రీడాపోటీలను పరిశీలించారు. జిల్లావ్యాప్తంగా 176 మంది హాజరయ్యారు. 4వ తరగతికి 20, 5వ తరగతికి 20 మంది బాలబాలికలు రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

మన ఊరు–మన బడి పనులు పరిశీలన



వీర్నపల్లిలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

వీర్నపల్లి(సిరిసిల్ల): వీర్నపల్లితోపాటు కంచర్ల, బావుసింగ్‌నాయక్ గ్రామాల్లో మన ఊరు–మన బడి పనులను కలెక్టర్ అనురాగ్ జయంతి బుధవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కంచర్ల పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపకపోవడంతో అధికారులపై సీరియస్ అయ్యారు. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే పనులు పూర్తవుతాయన్నారు. వీర్నపల్లిలో చేపడుతున్న డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. రోడ్ల విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న పేదలకు ఇండ్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. డీఈవో రమేశ్, ఆర్డీవో శ్రీనివాస్, ఎంపీపీ భూల, జెడ్పీటీసీ కళావతి, ఎంపీడీవో నరేశ్, తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్, సెస్ డైరెక్టర్ మల్లేశం, సర్పంచ్ దినకర్, ఉపసర్పంచ్ రవి ఉన్నారు.

ఎల్లంపల్లి ఎత్తిపోతలు వైఎస్సార్ ఘనతే..

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



చందుర్తిలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

చందుర్తి(వేములవాడ): వేములవాడ నియోజకవర్గానికి ఎల్లంపల్లి నీళ్లు రావడానికి దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి చలువనేనని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. చందుర్తిలోని పెరుక కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మహా కుటుంబ సమ్మేళనలో పాల్గొని మాట్లాడారు. నిధులు, నియామకాలు, నీళ్ల పేరిట పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో సీఎం కేసీఆర్ కుటుంబమే బంగారుమయమైందన్నారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజా ఆదరణ లభిస్తుండడంతోనే బురదజల్లే కుట్రలు పన్నుతున్నారన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాటలను వక్రీకరిస్తూ ప్రజలను పక్కదారి పట్టించేందుకు కుట్రలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ హయాంలో 9 గంటలు ఉచిత విద్యుత్ అందించిన విషయాన్ని గుర్తు చేశారు. రైస్‌మిల్లర్లు, రాష్ట్ర ప్రభుత్వం కుమ్మక్కై రైతులను దోచుకున్నారని గుర్తుచేశారు. చందుర్తి మండలంలోనే దాదాపు 5,600 బస్తాలను తరుగు పేరిట కటింగ్ చేశారన్నారు. జెడ్పీటీసీ నాగం కుమార్, మాజీ జెడ్పీటీసీ పొద్దుపొడుపు లింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చిలుక రమేశ్, జిల్లా కార్యదర్శులు గొట్టె ప్రభాకర్, ఇందూరి మధు తదితరులు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేయాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



మాట్లాడుతున్న ఖీమ్యానాయక్

సిరిసిల్లఅర్బన్: అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ పేర్కొన్నారు. ఓటరు జాబితా సవరణ 2023, జాబితా తయారీ, సవరణలపై బుధవారం సమీక్షించారు. ఆగస్టు 26, 27, సెప్టెంబర్ 3వ తేదీల్లో మూడురోజులు ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. ఆర్డీవో పవన్‌కుమార్, తహసీల్దార్ విజయ్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

14న యువ ఉత్సవ్

సిరిసిల్లకల్చరల్: నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 14న యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ తెలిపారు. బుధవారం జిల్లా అదనపు సత్యప్రసాద్‌తో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 18 నుంచి 29 ఏళ్లలోపు యువతీ, యువకులు ఈ ఉత్సవంలో పాల్గొనవచ్చన్నారు. ఎన్‌వై కే జిల్లా అధికారి వెంకట్, జిల్లా పౌర సంబంధాల అధికారి మామిండ్ల దశరథం పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేరేదెన్నడో?

- సిరిసిల్లలో పేదల గూడు.. గోడు
- డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపులపై ఆగ్రహం
- ఊరిస్తూ..ఉసూరుమనిపిస్తున్న సర్కారు
- అర్హతలుండీ ఎంపిక కాని పేదలు
- అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై ఆగ్రహం



ఆర్డీవో ఆఫీస్ ముందు ధర్నా చేస్తున్న డబుల్‌బెడ్‌రూమ్ రాని బాధితులు(ఫైల్)

సిరిసిల్లటౌన్: పేదల సొంతింటి కల నెరవేరడం లేదు. ఏళ్లుగా ఎదురుచూపులే దిక్కవుతున్నాయి. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు పూర్తికాకపోవడం.. పూర్తయిన చోట అందరికీ పంపిణీ చేయకపోవడంతో నిరుపేదలు ఇంకా అద్దె ఇళ్లలోనే కాలం వెల్లదీస్తున్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్ల అర్హుల జాబితాను అధికారులు ప్రకటించగా.. రాని వారు తీరని ఆవేదనలో ఉన్నారు.

2,052 ఇళ్లు.. 16,648 దరఖాస్తులు

సిరిసిల్ల పట్టణంతోపాటు మున్సిపల్ విలీనమైన ఏడు గ్రామాల్లో గూడు లేని నిరుపేదలే అధికం. వీరి కోసం తంగళ్లపల్లి మండలం మండెపల్లి బైపాస్‌రోడ్డు, రగుడు, పెద్దూరు ఇలా నాలుగు ప్రాంతాల్లో మొత్తం 2,052 డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించారు. ఇళ్ల కోసం 16,548 దరఖాస్తులు వచ్చాయి. వాటిని అధికారులు ఐదు విడతల్లో వడబోసి 2,757 మందిని అర్హులుగా తేల్చారు. వార్డు సభల ద్వారా లాటరీ పద్ధతిలో 1,804 మందిని ఎంపిక చేశారు. ఇక అన్ని అర్హతలు ఉండి ఇల్లు దక్కని 963 మంది ఆశలు అడియాసలయ్యాయి. ఇన్నాళ్లు డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు వస్తుందని ఆశతో ఉన్న వారికి నిరాశే మిగిలింది. దీంతో బాధితులు ఆందోళన చెందుతుండగా ప్రభుత్వం అమలుచేయనున్న గృహలక్ష్మి పథకం ద్వారా మళ్లీ సొంతింటి కలపై ఆశలు పెరిగాయి.

బాధితుల ఆవేదన ఇవీ..

- అన్ని అర్హతలుండీ ఇల్లు రాని వారికి ఇంటి స్థలం కేటాయించాలి.
- నివేశన స్థలాలిచ్చిన వారికి ఇల్లు కట్టుకునేందుకు రూ.5లక్షలు ఉచితంగా అందించాలి.
- ఇంటి నిర్మాణానికి పర్మిషన్ వెంటనే ఇవ్వాలి.
- స్థలం ఉన్న వారికి ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు అందించాలి.

వివరాలు ఇలా..

'డబుల్' దరఖాస్తులు	16,648
నిర్మాణమైన ఇళ్లు	2,052
ఎంపికైన వారు	1,804

ఒంటి చేత్తో ఇల్లు వెల్లదీస్తున్న



మా ఆయన రవి మూడేళ్ల కిందటే అనారోగ్యంతో చనిపోయిండు. అప్పటి నుంచి బీడీలు చేస్తూ.. ఒంటిచేత్తో ఇల్లు వెల్లదీస్తున్న. నెలకు రూ.2వేలు ఇంటి కిరాయి కడుతున్న. ఎన్నోసార్లు అధికారులను కలిసిన. ఇస్తామంటుండ్రు కానీ ఇవ్వడం లేదు. బీడీల పని తగ్గి ఆదాయం కూడా తక్కువైంది. సొంతిల్లు ఇచ్చి మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

– వంగల భారతి, తారకరామానగర్

లిస్టులో పేరు రాలేదు



నేను బీడీలు చుడుత. మా ఆయన సతీశ్ వైపని కార్మికుడు. ఇద్దరు పిల్లల కోసం ఇద్దరం కష్టపడితే వచ్చేవి నెలకు రూ.15వేలు. మా అత్తామామలకు కూడా ఇల్లు లేదు. వారు మేము వేర్వేరుగా కిరాయికి ఉంటున్నాం. నెలకు రూ.4వేలు అద్దెకే పోతే మేమెట్లా బతికేది. సర్కారు ఇస్తానన్న డబుల్‌బెడ్రూం ఇప్పించాలి.

– కస్తూరి అఖిల, బీడీ కార్మికురాలు

ఇస్తామని చెప్పి..ఇవ్వలేదు



మేము గరీబోళ్లం. మా అత్తమ్మకు వృద్ధాప్య పింఛన్ కూడా ఇస్తలేరు. ఎలాంటి ప్రభుత్వ సాయం అందడం లేదు. కూలి చేస్తే వచ్చే డబ్బులతోనే ఇల్లు వెల్లదీస్తున్నాం. పదిహేనేళ్లుగా కిరాయి ఇంట్లో ఉంటున్నాం. సంపాదన ఎటూ సరిపోతలేదు. డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కోసం మమ్మల్ని ఓకే చేసినట్లు చెప్పిండ్రు. తీరా లిస్టులో పేరురాలేదని ఇవ్వడం లేదు.

– గుంటుకు చందన, బీవై నగర్

పోటాపోటీగా దిష్టిబొమ్మల దహనం





ముస్తాబాద్‌లో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, చందుర్తిలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల రాస్తారోకోలు, ధర్నాలు

ముస్తాబాద్(సిరిసిల్ల)/చందుర్తి(వేములవాడ): రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు, ప్రభుత్వ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు బుధవారం జిల్లాలో పోటాపోటీగా ధర్నాలు, నిరసనలు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను, కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ముస్తాబాద్‌లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పాల్గొని మాట్లాడారు. రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ రైతులను శత్రువులుగా చూస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. చందుర్తిలో డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. ఆయా కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ నాయకులు గుండం నర్సయ్య, అంజిరెడ్డి, సురేందర్‌రావు, అక్కరాజు శ్రీనివాస్, కొమ్ము బాలయ్య, సర్వర్, మల్లారెడ్డి, నల్లనర్సయ్య, శాడ శ్రీను, మనోహర్, షాదుల్, కాంగ్రెస్ నాయకులు చింతపంటి రామస్వామి, నాగం కుమార్, భీంరాజు కల్యాణి, ముష్కు పద్మ, వనిత, గొట్టె ప్రభాకర్, ఇందూరి మధు, ధర్మపురి శ్రీనివాస్, దారం చంద్రం, పులి సత్తయ్య, బొజ్జ మల్లేశం పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధిగా వేణు



వేణును సన్మానిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ

సిరిసిల్లటౌన్: జిల్లా అధికార ప్రతినిధిగా పట్టణానికి చెందిన అన్నల్‌దాస్ వేణును నియమించినట్లు జిల్లా బీజేపీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వేణు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లాలోని మైనార్టీ గురుకులంలో ఖాళీగా ఉన్న రెండు టీచర్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనార్టీల సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్లలోని బాలికల పాఠశాల, కళాశాలలో జూనియర్ లెక్చరర్ ఫిజిక్స్, టీజీపీ సోషల్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. ఎంఎస్సీ బీఈడీ, ఎంఏ సోషల్, బీఈడీ విద్యార్హతలు గల అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలని సూచించారు. ఈనెల 18 వరకు దరఖాస్తులను మైనార్టీ శాఖాధికారి కార్యాలయంలో అందించాలన్నారు.

16 లోపు హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

సిరిసిల్ల కల్చరల్: హైదరాబాద్ బీసీ స్టడీసర్కిల్ ద్వారా సివిల్స్ లాంగ్ టర్మ్ కోచింగ్ కోసం నిర్వహించనున్న స్క్రీనింగ్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల హాల్ టికెట్లు విడుదల అయినట్లు సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి తెలిపారు. ఈనెల 16లోపు వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 08723-223004 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటలో బుధవారం తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయ పూజారి సీతారామాచార్యులు ఇంటికి తాళం వేసి నెల రోజుల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇంటికి వెళ్లారు. బుధవారం సాయంత్రం ఇంటి గేటు, తలుపులు తీసి ఉండడం గమనించిన స్థానికులు వెళ్లి చూడగా.. ఇంట్లో దొంగతనం జరిగినట్లు గుర్తించారు. బీరువా, ఇంటితాళాలు పగులగొట్టి ఉండడంతోపాటు ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

బీజేపీ నాయకుడికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్న హరిబాబు

ముస్తాబాద్: ముస్తాబాద్, రాళ్లపేట రహదారి నిర్మాణంలో ఉండగా సీసీరోడ్డుపై బీజేపీ నాయకుడు కామిటికార్ హరిబాబు గాయపడ్డాడు. రహదారి పనుల్లో ఇంటిముందు అరుగులు తీసివేయగా, ఇంట్లోంచి కిందికి దిగుతున్న హరిబాబు ఒక్కసారిగా కిందపడిపోయాడు. దీంతో ఎడమ కాలుకు తీవ్ర గాయమైంది. దీంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రహదారి నిర్మాణ పనులు రెండేళ్లుగా సాగుతున్నాయని, పనులు త్వరగా పూర్తిచేసి, ప్రమాదాలు జరగకుండా చూడాలని అధికారులను కోరాడు.

ఆదిదేవుని సేవలో దంపతులు

- హుండీ లెక్కింపు, భక్తుల రద్దీ సమయంలో దంపతుల ఉచిత సేవలు
- ఇదేబాటలో తల్లీకూతుళ్లు... అక్కాచెల్లెళ్లు
- అధికారులు, పలువురి అభినందన

వేములవాడ: భోళా శంకరుడిగా పేరొందిన వేములవాడ రాజన్నకు భార్యాభర్తలు, తల్లీ కూతుళ్లు, అక్కా చెల్లెలు వందలాది మంది ఉచిత సేవలో తరిస్తున్నారు. వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి సన్నిధిలో జరిగే హుండీ లెక్కింపు, భక్తుల రద్దీ సమయంలో ఉచితంగా సేవలందించేందుకు వీరు ముందుకొస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి దైవసేవే పరమార్థంగా భావించి సొంత ఖర్చులతో రాజన్న ఆలయానికి చేరుకుంటున్నారు. వీరి సేవలను ఆలయ అధికారులు, ప్రముఖులు అభినందిస్తున్నారు. బుధవారం రాజన్న సన్నిధిలోని హుండీ లెక్కింపులో భార్యాభర్తలు, తల్లీకూతుళ్లు, అక్కా చెల్లెళ్లు పరమశివుడికి ఉచితంగా సేవలందించిన వారిపై సాక్షి ప్రత్యేక కథనం..



హుండీ లెక్కింపులో పాల్గొన్న శ్రీరాజరాజేశ్వరి సమితి సభ్యులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న దంపతులు ప్రదీప్‌కుమార్– శ్రీదేవి. వరంగల్ నుంచి సొంత ఖర్చులతో వేములవాడకు ఉదయమే చేరుకొని స్వామివారి ఓపెన్ స్లాబ్‌లో జరిగే హుండీ లెక్కింపులో ఉచితంగా సేవలందించారు. మూడేళ్లుగా ఆరుసార్లు ఆలయంలో సేవలందించినట్లు చెబుతున్నారు. రాజన్న ఆలయంతోపాటు తిరుపతి, భద్రకాళి, ఐలోని మల్లన్న ఆలయాల్లోనూ ఉచితంగా సేవలందించినట్లు చెబుతున్నారు.



ఈ ఫొటోలో కనిపిస్తున్న వారు సిరిసిల్లకు చెందిన రఘునందన్, విజయలక్ష్మి దంపతులు. రెండేళ్లుగా ఇప్పటికీ నాలుగుసార్లు వేములవాడ రాజన్న ఆలయానికి చేరుకొని ఉచిత సేవలందించారు. బాసర సరస్వతి, సిరిసిల్లలోని వేంకటేశ్వర స్వామివారి ఆలయాల్లోనూ వీరు ఉచితంగా సేవలందించామని తెలుపుతున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న లావణ్య, లక్ష్మి తల్లీ కూతుళ్లు. వీళ్లది నిర్మల్ జిల్లా కవ్వట్ల గ్రామం. గత ఐదేళ్లుగా భగవంతుడి సన్నిధానాల్లో సేవలు అందిస్తున్నారు. ఇప్పటికీ మూడుసార్లు వేములవాడ రాజన్నకు సేవలందించారు. తమ సొంత ఖర్చులతోనే ఇక్కడికి చేరుకొని రాజన్నకు ఉచిత సేవలందిస్తున్నామని చెబుతున్నారు. రాజన్న ఆలయంతో పాటు బాసర అమ్మవారు, అడెల్లిపోచమ్మ ఆలయాల్లోనూ సేవలందించామంటున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న రూప, రాజవ్వ తల్లీకూతుళ్లు. కొడిమ్యాల మండలంలోని నాచుపల్లి గ్రామం. ఇప్పటికీ ఆలయంలో నాలుగుసార్లు సేవలందించారు. తమ కుటుంబం ఆనందంగా ఉండడం వల్లే ఏడాదిలో నాలుగుసార్లు స్వామివారి సేవలో పాల్గొన్నట్లు చెబుతున్నారు. వేములవాడతోపాటు కాళేశ్వరం, ఓదెల ఆలయాల్లోనూ ఉచిత సేవలందించామని చెబుతున్నారు.

పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి



మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ సత్యప్రసాద్

సిరిసిల్లఅర్బన్: మన –ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా చేపట్టి, చివరి దశలో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వీర్నపల్లి, గంభీరావుపేట మండలాల్లో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పనులు చేపడుతున్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. గంభీరావుపేటలో 15, వీర్నపల్లిలో 8 పాఠశాలల్లో చేపట్టిన పనుల పురోగతిపై ఆరాతీశారు. సమావేశంలో డీఈవో రమేశ్, పంచాయతీ రాజ్ ఈఈ సూర్యప్రకాశ్, టీఎస్ ఈడబ్ల్యూయూఐడీసీ ఈఈ విరూపాక్ష, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఇంజినీరింగ్ విభాగాల అధికారులు, తదితరులున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్సై

గంభీరావుపేట: మండలకేంద్రంలోని సుభాష్‌నగర్‌కు చెందిన అబ్దుల్ రహీం వారం రోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. సీఐఈఆర్ ద్వారా సెల్‌ఫోన్‌ను గుర్తించి బుధవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. ఎవరైనా ఫోన్ పోగొట్టుకున్నా, ఎత్తుకెళ్లినా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు.

పరిష్కారం కాని భూవివాదం

- కేసు నమోదు చేసిన పోలీసులు
- ఏళ్లుగా నానుతున్న సమస్య
- పరిష్కరించని రెవెన్యూ అధికారులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని హరిదాస్‌నగర్ శివారులో సర్వేనంబర్ 385/14లో రెండెకరాల భూమిపై వివాదం కొనసాగుతోంది. హరిదాస్‌నగర్‌కు చెందిన అన్నదమ్ములు ఉప్పుల మల్లయ్య, ఉప్పుల ఎల్లయ్య ఆ భూమిలో కొన్నాళ్లుగా సాగుచేసుకుంటున్నారు. ఇటీవల ఉప్పుల ఎల్లయ్య కొడుకు రవి అదే సర్వేనంబర్‌లోని 20 గుంటల స్థలాన్ని అతని భార్య లత పేరిట 2013లో లావణి పట్టా చేయించుకున్నాడు. అప్పటి నుంచి మల్లయ్య, ఎల్లయ్య కుటుంబాల మధ్య వివాదం నడుస్తోంది. మల్లయ్య కుటుంబ సభ్యులు తనను బెదిరించారని రవి ఫిర్యాదుతో పోలీసులు కేసు కూడా నమోదు చేశారు. ఏళ్లుగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఈ విషయమై ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ జయంత్‌కుమారును వివరణ కోరగా.. అది ప్రభుత్వ భూమి అని.. సర్వే పూర్తయిన తర్వాత వివరాలు వెల్లడిస్తామన్నారు.

మార్కండేయ ఆలయానికి విరాళం



అంకాలపు రవి-మాధవి దంపతులను సన్మానిస్తున్న పద్మశాలీ సంఘం ప్రతినిధులు

సిరిసిల్ల: సిరిసిల్లలో శివభక్త మార్కండేయ స్వామి ఆలయ నిర్మాణానికి అంకాలపు రవి–మాధవి దంపతులు రూ.5లక్షల121లను విరాళాన్ని బుధవారం అందజేశారు. సిరిసిల్ల మార్కండేయ వీధిలో ఆలయ నిర్మాణానికి పట్టణ పద్మశాలీ సంఘం విరాళాలు సేకరిస్తోంది. ఇందులో భాగంగా రూ.5 లక్షలు విరాళంగా అందించిన రవి–మాధవి దంపతులను పద్మశాలీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు గోలి వెంకటరమణ, మండల సత్యం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు ఏనుగుల ఎల్లయ్య, డాక్టర్ గాజుల బాలయ్య, సిరిసిల్ల వెంకటరమణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీతోనే బహుజనుల రాజ్యాధికారం



సైకిల్ ర్యాలీలో పాల్గొన్న నాయకులు

బోయినపల్లి(చొప్పదండి): బీఎస్పీతోనే బహుజనుల రాజ్యాధికారం సాధ్యమవుతుందని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి మేకల రవీందర్, జోనల్ కన్వీనర్ జున్ను స్వరూప పేర్కొన్నారు. బుధవారం మండలంలోని మల్లాపూర్‌లో ఆగస్టు 6న చొప్పదండిలో జరిగే బహుజన రణభేరి విజయవంతం కోసం నిర్వహించిన సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జి కొంకటి శేఖర్, మంద రవీందర్, మాంకాళి తిరుపతి, నల్లాల రాజేందర్, మండల అధ్యక్షుడు అలువాల అజయ్, షమీం, బూత్కూరి కాంత, పిట్ట మనోహర్, ఇల్లెందుల అనిల్, కట్కూరి ఆంజనేయులు, సు రేశ్,నవీన్, సంతోష్, రిషి, తదితరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకే



తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మద్యంతాగి వాహనాలు నడిపితే జైలుకు వెళ్లడం ఖాయమని ఎస్సై ప్రేమ్‌దీప్ అన్నారు. మండలంలోని రాగట్లపల్లి, దుమాల గ్రామ శివారుల్లో పోలీసులు బుధవారం వాహన తనిఖీలు చేపట్టారు. సరైన వాహనపత్రాలు లేని 20 వాహనాలకు జరిమానా విధించారు. మద్యంతాగి వాహనాలు నడిపిన ఇద్దరిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. నెంబర్ ప్లేట్ లేని వాహనాలపై ప్రయాణిస్తే వాహనాలను సీజ్ చేస్తామన్నారు. వారం రోజుల్లో 45 వాహనాలకు జరిమానాలు విధించినట్లు తెలిపారు. తనిఖీల్లో సిబ్బంది పాల్గొన్నారు.

పాతపెన్షన్ అమలు చేయాలి

సిరిసిల్లఎడ్యుకేషన్: ఉద్యోగుల పాత పెన్షన్ స్కీం అమలు చేయాలని నిర్వహించే రాష్ట్రస్థాయి ఐక్య సదస్సును విజయవంతం చేయాలని బుధవారం ఉపాధ్యాయ సంఘాల నాయకులు కోరారు. సీపీఎస్ రద్దుకు జాయింట్ ఫోరం ఫర్ రీస్టోరేషన్ ఆఫ్ ఓల్డ్ పెన్షన్ స్కీం ఆధ్వర్యంలో ఈనెల 23న హైదరాబాద్‌లో ఐక్య సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఐక్య సదస్సు జరుగుతుందన్నారు. నాయకులు పాతూరి మహేందర్‌రెడ్డి, పురుషోత్తం, శ్రీనివాస్, దోర్నాల భూపాల్‌రెడ్డి, దొంతుల శ్రీహరి, ఉత్తమ్ విజయకుమార్, బోయన్నగారి నారాయణ, గుండమనేని మహేందర్‌రావు, దుమాల రమానాథ్‌రెడ్డి, మిట్టపల్లి ప్రశాంత్‌కుమార్, బుర్ర కృష్ణప్రసాద్, బూస రాజేందర్, ఎం.తిరుపతి, అంబటి రమేశ్, తడుక సురేష్, గంగారాం, భూమయ్య, సురేశ్‌కుమార్ పాల్గొన్నారు.

విధివంచితుడిని ఆదుకోవాలి

- వెంటాడిన నరాల బలహీనత
- నడవలేని స్థితిలో బాలుడు
- కొడుకు దీనస్థితిపై తల్లడిల్లుతున్న తల్లిదండ్రులు
- ఆపన్నహస్తం కోసం ఎదురుచూపులు



బాలుడి ఆరోగ్య వివరాలు తెలుసుకుంటున్న ఆగయ్య



బాలుడిని ఎత్తుకున్న తండ్రి శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): బుడి.. బుడి అడుగులతో ఆ ఇల్లు ఎంతో సందడిగా ఉండేది. కొడుకు కళ్లముందు ఇంట్లో తిరుగుతుంటే ఆ తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. ఆలస్యంగా సంతానం కలుగగా.. ఆ ఒక్కగానొక్క కుమారుడికి ఉన్నట్టుండి నరాల బలహీనతతో నిలబడలేక.. నడవలేక నరకం అనుభవిస్తుంటే ఆ తల్లిదండ్రులు కుమిలిపోతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్ట తండాకు చెందిన నిరుపేద గిరిజన దంపతులు భూక్య లలిత–శ్రీనివాస్ ఆటో కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. వారికి మనోజ్‌కుమార్(9), పది నెలల కూతురు ఉంది. మనోజ్‌కుమార్‌ను స్థానికంగా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి వరకు చదివించారు. వేసవి సెలవుల అనంతరం ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలకు వెళ్లకముందే మనోజ్‌కుమార్ నరాల బలహీనత వ్యాధికి గురయ్యాడు. రోజురోజుకు వ్యాధి తీవ్రత పెరగడంతో ప్రస్తుతం నడువలేక.. నిలబడలేక నరకం అనుభవిస్తున్నాడు. మనోజ్‌కుమార్‌కు సుమారు రూ.3 లక్షల వరకు వెచ్చించి సిరిసిల్ల, కరీంనగర్, హైదరాబాద్ వంటి పట్టణాల్లో పెద్ద ఆస్పత్రులలో చూపించారు. అయినా వ్యాధి నయం కాలేదు. 64 శాతం అంగవైకల్యం సర్టిఫికెట్ ఉన్నప్పటికీ ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకు ఎలాంటి సాయం అందడం లేదు. ఖరీదైన వైద్యం అందించడానికి రూ.6లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. ఆటో జీవనాధారంగా బతుకుతున్న ఆ కుటుంబం కుమారుడిని కాపాడుకునేందుకు ఆపన్నహస్తం కోసం దాతలను అర్థిస్తున్నారు.

ఆదుకోవాలని వేడుకోలు

నడువలేని స్థితిలో ఉన్న ఒక్కగానొక్క కొడుకు ఆరోగ్య పరిస్థితిని బాగుచేయించాలని మంగళవారం ఆ తండాకు వెళ్లిన బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్యను లలిత–శ్రీనివాస్ దంపతులు వేడుకున్నారు. స్పందించిన ఆగయ్య బాలుడి పరిస్థితిని మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి హైదరాబాద్‌లోని నరాలకు సంబంధించి ఆస్పత్రిలో మెరుగైన వైద్యంతోపాటు వికలాంగుల పెన్షన్ ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.

> దాతలు సాయం చేయాల్సిన నంబర్
> శ్రీనివాస్
> ఫోన్‌పే : 96188 74300

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



తరగతులు బహిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు

సిరిసిల్ల టౌన్: రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు మల్లారపు ప్రశాంత్, అంగూరి రంజిత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిరిసిల్లలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తరగతులను బహిష్కరించి మాట్లాడారు. ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో అధిక ఫీజుల దోపిడీ అరికట్టాలని, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాలలు ప్రారంభమై నెల గడుస్తున్నా పుస్తకాలు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. మన ఊరు – మన బడి ద్వారా గుత్తేదారులు తూతూ మంత్రంగా పనులు చేపట్టారని ఆరోపించారు. ఫీజు రీయంబర్స్‌మెంట్లు విడుదల చేయాలని, గురుకులాలు సొంత భవనాలు నిర్మించాలని ప్రభుత్వానికి సూచించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు దొబ్బల ప్రవీణ్, రమేశ్, చంద్ర, అనీల్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేటలో..

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): రాష్ట్రంలో కార్పొరేట్, విద్యాలయాల్లో అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నా ప్రభుత్వం వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవడం లేదని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర బాలికల కన్వీనర్ ముక్తపల్లి పూజ, జిల్లా ఉపాధ్యక్షుడు జాలపల్లి మనోజ్‌కుమార్ అన్నారు. మండలంలో అన్ని విద్యాసంస్థలు సంపూర్ణ బంద్ పాటించాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపించారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం హామీ అందని ద్రాక్షగా మారిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్, దినేశ్, రాకేశ్, బన్నీ, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



రాకేశ్ (ఫైల్)

రాయికల్ : మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన పిట్టల రాకేశ్ (31) అనే రైతు విద్యుదాఘాతంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రాకేశ్‌కు గ్రామంలో ఎకరన్నర పొలం ఉండగా సాయంత్రం నారుమడికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. వ్యవసాయ బావివద్ద ఉన్న స్టార్టర్‌ను ఆన్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉంది.

యువతి అదృశ్యం

సారంగాపూర్: బీర్‌పూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి (19) అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. స్టేషన్ హౌజ్ అధికారి గజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సదరు యువతి బుధవారం ఉదయం ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో యువతి తండ్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వేలం రద్దు



కల్యాణకట్టలో తలనీలాలు తీస్తున్న నాయీ బ్రాహ్మణులు

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు ఆంజనేయ స్వామివారి ఆలయానికి సంబంధించి తలనీలాలు పోగు చేసుకునే వేలానికి బుధవారం చివరి రోజు కాగా ఎలాంటి డీడీలు రాలేదని కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస శర్మ, టెండర్‌ల ఇన్‌చార్జి శ్రీనివాసచారి తెలిపారు. వచ్చే సంవత్సరం జనవరి 1నుంచి జూలై వరకు సంబంధించి ఈనెల 14 న వేలం నిర్వహించనున్నట్లు అధికారులు తెలపగా టెండర్‌దారుల నుంచి డీడీలు రాలేదని, రద్దుచేసి తిరిగి మళ్లీ నిర్వహించే తేదీని ప్రకటిస్తామన్నారు.

సాయి హుండీ ఆదాయం రూ.4.86 లక్షలు

కోరుట్ల: పట్టణ శివారులోని సాయిబాబా ఆలయ హుండీ ఆదాయం రూ.4,86,280 సమకూరినట్లు ఆలయ అధ్యక్షుడు చిదురాల భూమయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలోని హుండీని లయ మండపంలో తెరిచి లెక్కించగా నగదుతోపాటు బంగారం, వెండి మిశ్రమ బంగారం లభించిందన్నారు. కంసాలి లేక పోవటంతో బంగారం, వెండి మిశ్రమాన్ని తిరిగి హుండీలో వేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయ శాఖ పర్యవేక్షకుడు రవికిషన్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

31 వరకు అడ్మిషన్లు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ప్రభుత్వ ఐటీఐ కళాశాలల్లో రెండో విడత అడ్మిషన్లు జరుగుతున్నట్లు సిరిసిల్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కనకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12 నుంచి 31 వరకు ఆన్‌లైన్ ద్వారా పదో తరగతి పూర్తయిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మండెపల్లి ప్రభుత్వ ఐటీఐ లో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మోటార్ మెకానిక్ వెహికిల్, వెల్డర్, మెకానిక్ డీజిల్ కోర్సులు ఉన్నాయన్నారు.

ఏ కనెక్షన్ ఎవరిదో !

జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌లోని 25వ వార్డు.. 14వ రోడ్డు వద్ద గల విద్యుత్ స్తంభాన్ని ఎన్నో రకాలు వైర్లు అల్లుకున్నాయి. డిష్ కనెక్షన్ వైర్లు.. ఇంటర్నెట్ కేబుల్స్.. ఇలా వైర్ల చుట్టలు స్తంభం కనిపించకుండా చుట్టేశాయి. ఇందులో ఎవరి ఇంటికి ఏ కనెక్షన్ వెళ్లిందో కూడా కరెంటోళ్లనే తికమక పెట్టేలా ఇలా ప్రైవేట్ వ్యక్తులు కరెంట్ స్తంభాన్ని వాడేసుకుంటున్నారు. అసలే వర్షాకాలం ఇలా వైర్లు ఉంటే ఎలా అని స్థానికులు చర్చించుకుంటున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, రాజన్నసిరిసిల్ల

